

పూడూరు : పోలీసులు అరెస్టు చేయడంతో స్టేషన్ బయట భోజనం చేస్తున్న పూడూరు గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు



నిరసన తెలుపుతున్న మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్

### బీఆర్ఎస్, జేఏసీ నాయకుల

# ముందస్తు అరెస్టు

## నేవీ రాడార్ సెంటర్ శంకుస్థాపన పనులను అడ్డుకుంటారనే..

పూడూరు, అక్టోబర్ 15 : నేవీ రాడార్ కేంద్రం శంకుస్థాపన పనులకు అడ్డొస్తారనే ఉద్దేశంతో బీఆర్ఎస్, దామగుండం అడవి పరిరక్షణ జేఏసీ నేతలను పోలీసులు సోమవారం అర్ధ రాత్రి సమయంలో అరెస్టు చేశారు. మాజీ ఎంపీపీ మల్లేశం, మాజీ వైస్ ఎంపీపీ మాణిక్యంగౌడ్, మాజీ సర్పంచ్ బుచ్చన్నలతోపాటు మరో 20 మందిని అదుపులోకి తీసుకుని కులకచర్ల ఠాణాకు తరలించారు. అదేవిధంగా దామగుండం అడవి పరిరక్షణ జేఏసీ కన్వీనర్ వెంకటయ్య, కమిటీ సభ్యులు రామన్న, శ్రీనివాస్, సునందతోపాటు మరికొంత మందిని పరిగి ఠాణాకు.. పూడూరు గ్రామానికి చెందిన సతీశ్‌పంతులు, శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, రాంచంద్రయ్యలను చన్గోముల్ ఠాణాకు తీసుకెళ్లారు. మన్నెగూడ చౌరస్తా, పూడూరు గేటు, దామగుండం ఆలయ సమీపంలో, గూడుపల్లి వెళ్లే చౌరస్తాల్లో.. నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపన చేసే సమీపంలో కంచెలు ఏర్పాటు చేసి ఎవరూ ఆ మార్గం నుంచి వెళ్లకుండా భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. మండల కార్యాలయాలకు వెళ్లే వారి వివరాలను తెలుసుకొని పంపించారు. దామగుండం అడవిలో భారీ సంఖ్యలో పోలీసులు, మిలిటరీ, నేవీ శాఖ సిబ్బంది గస్తీ నిర్వహించారు. కాగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వికారాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగి శంకుస్థాపన చేసే ప్రాంతానికి వెళ్లాల్సింది.. అయితే వారు వాహనాల్లో హైదరాబాద్ నుంచి నేరుగా వికారాబాద్‌కు రోడ్డు మార్గం ద్వారా రావడంతో హైదరాబాద్-బీజాపూర్ హైవేపై, మన్నెగూడ చౌరస్తాలో వాహనాలను అరగంటపాటు పోలీసులు నిలిపివేశారు. కాగా ముందస్తుగా అరెస్టు చేసిన ఆయా గ్రామాల బీఆర్ఎస్, జేఏసీ నాయకులను సా యంత్రం సమయంలో వదిలి పెట్టారు.

### అర్ధరాత్రి అక్రమ అరెస్టులు సిగ్గుచేటు

దోమ : దామగుండంలో నేవీ రాడార్ సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన ఉన్నందున బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అర్ధరాత్రి సమయంలో అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గు చేటని దోమ మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం అన్నారు. పోలీసులు మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, దోమ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపాల్‌గౌడ్‌లను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు.

### రాష్ట్రంలో నిర్బంధ పాలన ..

పరిగి : రాష్ట్రంలో నిర్బంధ పాలన సాగుతున్నదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం పూడూరు మండలంలోని దామగుండంలో నేవీ

### దామగుండం వైపు వెళ్లకుండా పోలీసుల భారీ బందోబస్తు

రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రవికుమార్, సునందాబుగ్గన్నయాదవ్, దామగుండం పరిరక్షణ వేదిక నాయకుడు రామన్నమాదిగ, టీజేఏసీ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్‌తోపాటు పలువురిని పోలీసులు అరెస్టు చేసి ముందు పరిగి పోలీసు సర్కిల్ కార్యాలయానికి అక్కడి నుంచి కులకచర్ల ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీసులను అడ్డంపెట్టుకొని పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. నేవీ రాడార్ ఏర్పాటుపై ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

### పర్యావరణానికి పెను ముప్పు

కులకచర్ల : పూడూరు మండలంలో రాడార్ కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఎలాంటి అలజడులు జరుగకుండా ఉండేందుకు పోలీసులు మంగళవారం బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. నేవీ రాడార్ కేంద్రం నిర్మాణంతో పర్యావరణానికి ముప్పు అని తెలిసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ పనులకు ప్రారంభోత్సవం చేయడం తగదని పలువురు మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కులకచర్ల మండలాధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు పీరంపల్లి రాజు, శ్రీనివాస్, మాలె కృష్ణయ్యగౌడ్, లక్ష్మయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినికి కేటీఆర్ అభినందనలు



మాజీ మంత్రి కేటీఆర్‌తో విద్యార్థిని మేఘన, ఆమె కుటుంబ సభ్యులు, ఎన్ఆర్ఐ పొట్టి శ్రీనివాసులు తల్లి అమృతమ్మ, మున్సిపల్ చైర్మన్ నరేందర్

షాద్‌నగర్, అక్టోబర్ 15 : ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన మేఘనను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అభినందించారు. షాద్‌నగర్ పట్టణంలో టిఫిన్ వ్యాపారం చేసే బైరమోని రమేశ్-మంజుల దంపతుల కుమార్తె మేఘన ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విషయాన్ని స్థానిక కౌన్సిలర్ నర్సింహ ద్వారా తెలుసుకున్న షాద్‌నగర్‌కు చెందిన ఎన్ఆర్ఐ పొట్టి శ్రీనివాసులు తన తల్లి అమృతమ్మ ద్వారా విద్యార్థిని చదువు నిమిత్తం అందజేసిన రూ.40 వేల చెక్కును మంగళవారం మాజీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మేఘనకు అందజేశారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉజ్వల భవిత ఉంటుందని, ప్రతి విద్యార్థి కూడా తమ లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రయత్నించాలన్నారు. మేఘన విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు అన్ని ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చిన ఎన్ఆర్ఐ పొట్టి శ్రీనివాసులను మాజీ మంత్రి అభినందించారు. విద్యార్థినికి తమ వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, స్థానికు లు శేఖర్, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ మంత్రిని కలిసిన ఆంజనేయులు



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మంగళవారం చేవెళ్ల నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి దేశమళ్ల ఆంజనేయులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

-షాబాద్, అక్టోబర్ 15

# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

### వికారాబాద్ జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సదానందం



పశువుకు గాలికుంటు వ్యాధి టీకా వేస్తున్న పశువైద్యులు, పరిశీలిస్తున్న కడా ప్రత్యేకాధికారి

కొడంగల్, అక్టోబర్ 15 : రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని వికారాబాద్ జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సదానందం, ఏడీ డాక్టర్ నోవాలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు మాట్లాడుతూ సీజనల్ వ్యాధిగా పశువుల్లో గాలికుంటు వ్యాధి వచ్చే ప్రమాదముందని.. ఇందు కోసం ముందస్తుగా ప్రభుత్వం గాలికుంటు వ్యాధి టీకాలను పంపిణీ చేస్తున్నదన్నారు. అదేవిధంగా జిల్లా పరిధిలోని ప్రతి వెటర్నరీ దవాఖానలో సబ్సిడీపై గడ్డి విత్తనాలను అందిస్తున్నామని.. పాడి రైతులు వాటిని సద్వినియోగం చేసుకొని పశుగ్రాస కొరతను అధిగమించాలన్నారు. అనంతరం కొడంగల్ వెటర్నరీ పరిధిలో చేపట్టే కార్యక్రమాలను కడా ప్రత్యేకాధికారి వివరించారు. దేశీ పశువుల్లో మేలు రకమైన వీర్యాన్ని ప్రవేశపెట్టి మేలు రకమైన జాతి పశువులను పుట్టించడం జరిగిందన్నారు. కొడంగల్ పరిధిలో దాదాపు 190కి పైగా మేలు రకం దూడలను పుట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది ఆంజనేయులు, భరత్, వెటర్నరీ వైద్యుడు డాక్టర్ పరమేశ్, సిబ్బంది వెంటకయ్య, శేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

### సాయంత్రం వరకు సాగిన

# టీచర్ల కౌన్సెలింగ్

వికారాబాద్, అక్టోబర్ 15 : వికారాబాద్ జిల్లాలో ఉపాధ్యాయుల పోస్టింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం సాయంత్రం వరకు సాగింది. ఎస్ఏలు, ఎల్పీ (హిందీ), ఎస్ఏ(హిందీ), ఎస్‌జీటీ(ఎస్‌పీఎల్ ఈడీఎన్) మినహా అన్ని ఎస్‌జీటీలు, ఎల్పీలు, పీఈటీ, పీడీల కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి అయినట్లు జిల్లా అధికారులు తెలిపారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్(రెవెన్యూ), ట్రైనీ కలెక్టర్లు పాల్గొన్నారు.

# నేవీ రాడార్ కేంద్రం వద్దే..వద్దు

- దానితో మనుషులతోపాటు జంతువులకూ పెను ముప్పు
- బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయరావు
- తాండూరు పట్టణంలో నల్లబ్యాడ్జీలతో నిరసన



నేవీ రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయొద్దంటూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయరావు

తాండూరు/వికారాబాద్, అక్టోబర్ 15 : దామగుండం అడవిని నరికివేసి నేవీ రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే భావితరాలకు అన్యాయం చేసినట్లే అవుతుందని బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయరావు అన్నారు. మంగళవారం దామగుండంలో నేవీ రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయొద్దంటూ తాండూరు పట్టణంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆ అడవిలో ఎన్నో ఔషధ మొక్కలు, అరుదైన పక్షులు, అనేక జంతుజాతులు ఉండడంతోనే స్థానికులు, పర్యావరణవేత్తలు అక్కడ రాడార్ కేంద్రం వద్దే.. వద్దంటూ నిరసనలు తెలుపుతుంటే ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో ముందుకెళ్లడం భావ్యం కాదన్నారు. దాని నిర్మాణంతో 400 ఏండ్ల చరిత్ర కలిగిన రామలింగేశ్వరాలయం కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉండడం తో పాటు మూసీ, ఈసీ నదులు ఉనికిని కోల్పోయే అవకాశం ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాడార్ కేంద్రం ఏర్పాటుతో మనుషులతోపాటు జంతువులకూ ముప్పు ఉంటుందనే అనుమతులు ఇవ్వలేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే సీఎం రేవంత్ రెడ్డి ఆ ఫైల్‌పై సంతకం చేశారన్నా రు. ప్రభుత్వ మొండి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇకనైనా ప్రభుత్వం ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రాడార్ కేంద్రం ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాను, సాయి, నరేశ్, రమేశ్, అరవింద్ కుమార్, వినయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వో సంగీతకు వినతిపత్రాన్ని అందిస్తున్న సీపీఐ నాయకులు, బాధిత రైతులు

### గిరిజనుల భూములు ఆక్రమించిన

# వారిపై చర్యలు తీసుకోవాలి

### కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

రంగారెడ్డి, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : గిరిజన రైతుల భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట బాధిత రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ.. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని శంకర్‌పల్లి మండలంలోని కొండకల్‌తండా గిరిజనుల భూములను భూస్వామి ఒకరు దొంగ పత్రాలతో స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ఆ భూములను ఓ సంస్థకు కోట్ల రూపాయలకు అమ్ముకున్న సదరు భూస్వామిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల భూములతోపాటు సీలింగ్, అసైన్డ్ భూములను కూడా ఆక్రమించినట్లు పేర్కొన్నారు. గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం డీఆర్వో సంగీతకు వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పర్వతాలు, రామస్వామి, శంకర్‌పల్లి మండల కార్యదర్శి సుధీర్, నందిగామ మండల కార్యదర్శి జంగయ్య, రైతులు శంకర్‌నాయక్, రవీనాయక్, లక్ష్మణ్‌నాయక్, రాజు పాల్గొన్నారు.

## ఐటీ సెక్టార్‌లో ట్రాఫిక్ జామ్



గచ్చిబౌలి - రాయదుర్గం - మాదాపూర్ ఐటీ సెక్టార్ మంగళ వారం ట్రాఫిక్ స్తంభించి ఉక్కిరి బిక్కిరయ్యింది. ఇటు రాయదుర్గం - బయో డైవర్సిటీ నుంచి ఐకియా, ఏట్రియం గచ్చిబౌలి, మైండ్ స్పేస్, మాదాపూర్ వరకు వేలాది వాహనాలు ట్రాఫిక్ జామ్‌లో గంటల తరబడి ఇరుక్కుపోయాయి. ఎటువైపు చూసినా వాహనాలే.. వాహనాలు. ఫ్లై ఓవర్లపైనా.. కింద వేలాదిగా వాహనాలు ఆగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

# జల్సాలకు అలవాటుపడి చోరీలు

- ఇద్దరు నిందితుల అరెస్టు
- బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు




వివరాలు వెల్లడిస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 15 : జల్సాలకు అలవాటుపడి అప్పులు చేసి.. వాటిని తీర్చేందుకు చోరీలకు పాల్పడుతున్న నిందితులను గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు వెల్లడించారు. సూర్యాపేట జిల్లాలోని రామన్నగూడ గ్రామానికి చెందిన ప్రభాస్ బీటెక్ మూడో ఏడాది చదువుతున్నాడు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడి డబ్బులు పోగొట్టుకుని అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చేందుకు సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన శౌలిగౌరారం గ్రామానికి గుండ్లపల్లి శివ సహకారం తీసుకున్నాడు. వీరిద్దరు ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసి ముందుగా రెక్కీ నిర్వహిస్తారు. అందులో భాగంగానే కందుకూరు మండలంలోని ఆకులమైలారం గ్రామానికి చెందిన కందుకూరు పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్ తల్లి సుమతమ్మను ఎంచుకున్నారు. ఈనెల 10న సుమతమ్మ ఇంటికెళ్లి తలుపు తట్టారు.

వెంటనే ఆమె తలుపులు తీయడంతో ఇంట్లోకి చొరబడి ఒకరు నోరు మూయగా.. మరొక్కరు ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెలతాడు, రెండు తులా ల బంగారు గాజులను తస్కరించి పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఆమె చిన్న కుమారుడు నందీశ్వర్ 100 నంబర్‌కు ఫోన్ చేయగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. దొంగతనాన్ని ఛేదించేందుకు ఇబ్రహీంపట్నం ఏసీపీ ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా, తామే చోరీ చేసినట్లు అంగీకరించడంతో దొంగిలించిన బంగారాన్ని రికవరీ చేసి వారిపై కేసు నమోదు చేశారు.

### నిందితులను పట్టించిన అద్దె కారు..

నిందితులు చోరీకి వెళ్లే ముందు కారును అద్దెకు తీసుకున్నారు. ప్రభాస్ తాను పెద్ద అంబర్‌పేటలో నివాసముంటున్నట్లు ఆధార్ కార్డును చూపడంతో దాని యజమాని వారిని అద్దెకిచ్చాడు. ఆ కారులో చోరీకి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పెట్రోల్ అయిపోవడంతో దానిని రోడ్డు పక్కన వదిలిపెట్టారు. ఈ విషయం కారు యజమానికి తెలిసింది. కారును అద్దెకు తీసుకెళ్లిన వారే చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానించి.. విచారించారు. సాంకేతిక పరిజ్ఞానంతో కారు కొహెడ గ్రామంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించి.. నిందితులను చాకచక్యంగా పట్టుకుని వారి నుంచి బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ.. యువత ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే, ఒంటరి మహిళలు రాత్రి సమయాల్లో డోర్లు తీయొద్దన్నారు. చోరీ కేసును ఛేదించి నిందితులను పట్టుకున్న గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, ఎస్ఐ తేజంరెడ్డి, కానిస్టేబుళ్లు సుందరయ్య, ఇంతియాజ్, శేఖర్, ప్రభులను అభినందించారు.

### పేదల ఇండ్లపైకి

# బుల్డోజర్లు

### కూల్చివేతలకు రంగం సిద్ధం
### రెండో దఫాకు సన్నాహాలు



సిటీబ్యూరో, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): మూసీ వెంబడి మరో దఫా కూల్చివేతలకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే కూల్చివేతల బాధ్యతలను జిల్లా అధికారులకు అప్పగించి చేతులు దులుపుకొన్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ.., ఇక రెండో దశలోనూ పేదల ఇండ్లపైకి బుల్డోజర్లను ఉసిగొల్పనున్నది. మూసీ ఆక్రమణలను తొలగిస్తామని, ప్రాజెక్టు విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదంటూ చకచకా కూల్చివేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే రివర్ బెడ్ ప్రాంతంలో దాదాపు 2100 నిర్మాణాలు ఉన్నట్లుగా గుర్తించారు. వాటన్నింటినీ దశల వారీగా ఈ నెలాఖరులోగా కూల్చివేసిన వెంటనే, దీపావళి తర్వాత మూడో దఫా ఆక్రమణలు, నిర్మాణాల గుర్తింపు, కూల్చివేతలకు కసరత్తు మరో మారు చేపట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్టు తెలిసింది.

### నగరంలో 55 కిలోమీటర్ల మేర..

హైదరాబాద్ నగరంలో 55 కిలోమీటర్లు మేర విస్తరించిన మూసీ నదికి ఇరువైపులా రెండోసారి కూల్చివేతలు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయా జిల్లాల వారీగా ఇప్పటికే సేకరించిన సోషియో ఎకానమిక్ సర్వే, ముందుగానే గుర్తించిన రివర్ బెడ్ మ్యాపుల ఆధారంగా నిర్మాణాలను మూసీలో కలపనున్నారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల రెవెన్యూ, ఇరిగేషన్ మ్యాపులతో క్రోడీకరించిన మార్గాల వారీగా మార్కింగ్ చేశారు. వాటన్నింటినీ దశల వారీగా కూల్చేయనున్నారు. ఇప్పటికే మూడు జిల్లాల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో ఎంఆర్‌డీసీఎల్ సమన్వయ సమావేశం కూడా పూర్తి చేసింది. ఇక కూల్చివేతలను జిల్లా యంత్రాంగమే పర్యవేక్షించాలని మూసీ అథారిటీ ఆదేశాలు జారీ చేసింది.

### లెక్కకు మించి నిర్మాణాలు..

దశల వారీగా మూసీ వెంబడి నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. ప్రస్తుతం మూసీ రివర్ బెడ్ ప్రాంతంలోని నిర్మాణాల గుర్తింపు, మార్కింగ్, కూల్చివేతలను చేపట్టనున్నారు. అయితే, జిల్లా అధికారులు గుర్తించినట్లుగా మూడు జిల్లాల పరిధిలో 2100 కంటే ఎక్కువ ఉన్నట్లు రెవెన్యూ, ఇరిగేషన్ మ్యాపుల ద్వారా తెలిసింది. కూల్చివేతలపై ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకే సమన్వయ సమావేశం నిర్వహించినట్లుగా ఎంఆర్‌డీసీఎల్ వర్గాలు తెలిపాయి. రివర్ బెడ్ నిర్మాణాల కూల్చివేతలు పూర్తి కాగానే, ఎఫ్ఆర్ఎల్ పరిధిలో ఉన్న ఆస్తులు, నిర్మాణాలు, కట్టడాలను గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రధానంగా కోర్టు వ్యవహారాలతో కూల్చివేతలకు ఆటంకం లేకుండా ఉండేలా తగిన ఆధారాలు సమకూర్చుకోవాలని సూచించినట్లు తెలిసింది.